మహిళల ఆర్థిక ప్రగతికి 'ఆసరా'

- వైఎస్సార్ ఆసరా పొదుపు సంఘాలకు బాసట
- 3వ విడత వైఎస్సార్‌ఆసరా సదస్సులో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి


పాల కేంద్రానికి వచ్చిన పాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి

రామాపురం : వైఎస్సార్ ఆసరా పొదుపు సంఘాలకు బాసటగా నిలుస్తోందని వైఎస్సార్‌సీపీ రాయచోటి అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో జరిగిన మండల వైఎస్సార్ ఆసరా సదస్సు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ జగనన్న పాదయాత్రలో అక్క చెల్లెమ్మలకు ఇచ్చిన హామీలను నేరవేర్చుతున్నారన్నారు. ఎన్నికల సమయానికి డ్వాక్రా రుణాలను నాలుగు విడతలుగా మాఫీ చేస్తామని చెప్పి నేటికి మూడు విడతలుగా నిధులను మంజూరు చేశారన్నారు. రామాపురం మండలంలో వైఎస్సార్ మూడవ విడత క్రింద 479 సంఘాలకు రూ.3.25కోట్లు లబ్ధి చేకూరిందన్నారు. వేల కొట్లు రూపాలయను నేరుగా ప్రజల ఖాతాలలో జగన్ ప్రభుత్వం జమ చేయడం చరిత్రాత్మకమన్నారు. సుమారు నాలుగేళ్ల వైఎస్ జగన్ పరిపాలనలో పథకాలను ప్రతి తలుపు తట్టేలా చేసిన ఏకైక ప్రభుత్వం తమదని తెలిపారు. చంద్రబాబు 15 ఏళ్ల పాలనలో శాశ్విత అభివృద్ధి పథకం ఒక్కటైనా ఉందా అని ప్రశ్నించారు. ప్రజలకు మంచి జరిగి ఉంటే పార్టీకి ప్రభుత్వానికి అండగా నిలవాలన్నారు. ఊపిరి ఉన్నంవతరకు ప్రజా సేవకే తన జీవితం అంకితమని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గ ప్రజల సంక్షేమం కోసం నిత్యం కృషి చేస్తున్నామన్నారు. వైఎస్సార్ ఆసరా మూడవ విడతలో రామాపురం మండలంలోని 479 సంఘాలకు రూ.3.28 కోట్లు విలువ చేసే మెగా చెక్కును ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అందజేశారు. అనంతరం ఎంపీపీ గడికోట జనార్దన్‌రెడ్డి, జెడ్పీటీసీ మాసన వెంకటరమణ, మార్కెట్ కమిటీ చైర్మన్ కర్జపు విశ్వనాథరెడ్డి, సర్పంచ్‌లు వెంకటరెడ్డి, అయోధ్యాపురం నాగభూషన్‌రెడ్డి, సూరం వెంకట సుబ్బారెడ్డి, ఎంపీటీసీ రేఖం నారాయణ, మాజీ సర్పంచ్ మురళీ మోహన్‌రెడ్డి మాట్లాడారు. అన్ని ప్రాంతాల నుంచి మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

పూర్తయిన భవనాలను ప్రారంభించిన ఎమ్మెల్యే

వైద్య రంగంలో సీఎం వైఎస్ జగన్ విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం రామాపురంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నాడు- నేడు కింద రూ.37.09లక్షలతో నిర్మించిన మీటింగ్ హాల్, పూర్తయిన ఆసుపత్రి అభివృద్ధి పనులను ఆయన స్థానిక ప్రజాప్రతినిధులు, వైద్యాధికారులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. నల్లగుంటపల్లెలో నూతనంగా నిర్మించిన వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ను ఆయన ప్రారంభించారు.

జగనన్న పాలవెల్లువతో రైతుల్లో ఆనందం

జగనన్న పాలవెల్లువతో రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోందని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో దాదాపు రూ.50లక్షల వ్యయంతో నిర్మించిన జగనన్న పాల డెయిరీని శ్రీకాంత్‌రెడ్డి చేతులు మీదుగా ప్రజలకు అంకితం చేశారు. అమూల్ సంస్థ వారు నిర్వహించే జగనన్న పాలవెల్లువతో గ్రామాలలో పాడి రైతులు దూర ప్రాంతాలకు పోకుండా ఉండేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నిర్ణయం తీసుకున్నారని తెలియజేశారు. ప్రతి గ్రామంలో పాలు కొలిచే యంత్రాలు ఏర్పాటు చేసి ఆ కేంద్రాల ద్వారా మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పాల శీతల కేంద్రానికి తరలిస్తారని, ప్రతి పాడి రైతుకు వారు వేసిన పాలకు పది రోజులకు ఒక సారి బిల్లు చెల్లించేలా చర్యలు చేపడతామన్నారు.

ప్రజా సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి

లక్కిరెడ్డిపల్లె : ప్రజల సంక్షేమం, అభివృద్ధే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం లక్కిరెడ్డిపల్లె మండలంలోని స్వయం సహాయక సంఘాలతో ఏర్పాటు చేసిన వైఎస్సార్ ఆసరా మూడో విడత సదస్సులో శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అలుపెరుగని పాదయాత్రలో అక్కా చెల్లెమ్మలకు జగనన్న ఇచ్చిన హామీ నేడు మూడు విడతలుగా కార్యరూపం దాలిచ్చిందన్నారు. గత ప్రభుత్వాలు మహిళా సంఘాలను భారీ సమావేశాలకు తరలించుకున్నారే తప్పా వారికి లబ్ధి చేసింది ఏమీ లేదన్నారు. వైఎస్సార్ ఆసరా మూడో విడతలో మండలంలోని 436 సంఘాలకు రూ. 3.8 కోట్లు లబ్ధి చేకూరిందన్నారు. ప్రజా సమస్యలు పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించామని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. సమావేశం అనంతరం శ్రీకాంత్ రెడ్డి ప్రజల వద్దకే వెళ్లి సమస్యలపై ఆరా తీశారు. అనంతరం రూ. 3.8 కోట్లు విలువచేసే మెగా చెక్‌ను లబ్ధిదారులకు ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి చేతులు మీదుగా అందజేశారు. ఎంపిపి మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, మాజీ ఎంపీపీ అంబాబత్తిన రెడ్డయ్య, దిన్నెపాడు రవిరాజు, కో–ఆప్షన్ సభ్యుడు సయ్యద్ అమీర్, జెడ్పీటీసీ రమాదేవి, భాస్కర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సుబ్బరాయుడు, ఎంపీటీసీలు లక్ష్మినారాయణ, శంకర్ నాయుడు, జగన్‌మోహన్ రెడ్డి, సర్పంచ్‌లు సిద్ధిక నాగిరెడ్డి, రమణ, జనార్దన్ రెడ్డి, వైస్ ప్రెసిడెంటు రాజారెడ్డి, గంగమ్మ, ఆలయ చైర్మన్ నరసింహారెడ్డి, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, వైఎస్సార్ సీపీ నాయకులు రవిరాజు, రవి, రమణ, జనార్దన్ రెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కష్టాలు తెలుసుకున్నాడు.. లబ్ధి చేకూరుస్తున్నాడు

- చంద్రబాబు హయాంలో మహిళలకు చేసింది శూన్యం
- వైఎస్సార్ ఆసరాలో పాల్గొన్న ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు


మెగా చెక్కును అందిస్తున్న ప్రభుత్వవిప్ కొరముట్ల

పెనగలూరు : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మహిళలకు వివిధ పథకాల కింద రూ. 3 లక్షల కోట్లు నిధులు మంజూరు చేశామని ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. బుధవారం పెనగలూరు ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో వైఎస్సార్ ఆసరా కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన అన్ని పథకాలకు మహిళలనే లబ్ధిదారులుగా చేశారన్నారు. అలాగే వైఎస్సార్ ఆసరా కింద ఇప్పటి వరకు నియోజకవర్గానికి రూ. 89.35 కోట్లు మూడు విడతలలో మహిళలకు సున్నా వడ్డీ కింద వేశామన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ప్రజల కష్టాలను తెలుసుకొని అధికారంలోకి రాగానే నవరత్నాలను అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. చంద్రబాబు హయాంలో మహిళలకు చేసింది శూన్యమన్నారు. ఎన్నికలకు ముందు రుణాలు రద్దుచేస్తామని చెప్పి మహిళలను మోసం చేశారన్నారు. మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయడమే జగనన్న లక్ష్యమన్నారు. అంతకు ముందు జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు పంజం సుకుమార్ రెడ్డి మాట్లాడుతూ పాదయాత్రలో ఇచ్చిన మాటకు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి కట్టుబడి ప్రజల సంక్షేమం కోసం నిర్విరామంగా కృషి చేస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలు కింద జిల్లాకు రూ. 689 కోట్లు నిధులు ఇప్పటికే వచ్చాయన్నారు. మహిళల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి పాటుపడుతున్నారని, కావున మహిళలందరూ సీఎం జగన్‌ను ఆశీర్వదించాలన్నారు. అనంతరం డ్వాక్రా సంఘాలకు మెగా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వరప్రసాద్, మండలాధ్యక్షురాలు సౌందర్య, జెడ్పీటీసీ ఉదయగిరి సుబ్బరాయుడు, ముదిరాజ్ సంఘం రాష్ట్ర డైరెక్టర్ గుండ్లూరు ఈశ్వరయ్య, వైఎస్సార్‌సీపీ మండల సీనియర్ నాయకుడు బిఎల్ నరసింహారెడ్డి, సుధాకర్ రాజు, వెలుగు ఏరియా కో–ఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, ఏపీఎం నిరంజన్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

కల్యాణ ఏర్పాట్లను పరిశీలించిన టీటీడీ జేఈఓ


ముత్యాల తలంబ్రాల కిట్లను పరిశీలిస్తున్న జేఈఓ

ఒంటిమిట్ట : శ్రీ కోదండ రాముడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం జరగనున్న కల్యాణోత్సవానికి విచ్చేసే భక్తుల కోసం చేపట్టిన ఏర్పాట్లను టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం పరిశీలించారు. ఆలయం ఎదుట టీటీడీ అన్నప్రసాద విభాగం ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ ఏర్పాట్లను పరిశీలించారు. ఇక్కడ తెల్లఅన్నం, కురగాయల పలావు, చట్నీ, కేసరి, సాంబార్, రసం, పప్పు, కూరగాయల కర్రి భక్తులకు వడ్డిస్తున్నారు. పలువురు భక్తులను పలకరించి అన్నప్రసాదాల నాణ్యతను అడిగి తెలుసుకున్నారు. భోజన నాణ్యతపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం కల్యాణ వేదిక దగ్గర భక్తులకు పంపిణీ చేసేందుకు పులిహోర ప్యాకెట్ల తయారిని పరిశీలించారు. కల్యాణానికి విచ్చేసే భక్తుల కోసం ముత్యాల తలంబ్రాలు, పసుపు, కుంకుమ, కంకణాలు, రెండు చిన్న లడ్డూ ప్రసాదం, పులిహోర, వాటర్ బాటిల్ కలిపి తయారు చేసిన కిట్లను పరిశీలించారు. జేఈఓ వెంట టీటీడీ చీఫ్ ఇంజనీర్ నాగేశ్వర రావు, విద్యుత్ విభాగం ఎస్ఈ వెంకటేశ్వర్లు, డీఈ చంద్రశేఖర్, ఈఈ సుమతి, క్యాటరింగ్ ప్రత్యేక అధికారి శాస్త్రి, వీజీఓ మనోహర్, అదనపు ఆరోగ్య అధికారి డాక్టర్ సునిల్ తదితరులు పాల్గొన్నారు.

'చందాలు వసూలు చేయడంలేదు'


విగ్రహ ఏర్పాటు పనులను పర్యవేక్షిస్తున్న దళితనేతలు

నందలూరు(రాజంపేట) : అంబేడ్కర్ విగ్రహావిష్కరణ పేరుతో కొందరు వసూలు చేస్తున్న చందాలు తమకు సంబంధంలేదని నాగిరెడ్డిపల్లె సర్పంచ్ జంబు సూర్యనారాయణ, డివిజన్ ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు పెనుబాల నాగసుబ్బయ్య, దళిత ఐక్యవేదిక అధ్యక్షుడు కాకి చంద్రమోహన్ బుధవారం తెలిపారు. అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటు పనులను పర్యవేక్షించారు. ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో ఎంపీపీ మేడా విజయ భాస్కర్‌రెడ్డి నేతృత్వంలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ జరుగుతుందన్నారు. ఎవరి దగ్గర చందాలు వసూలు చేయడంలేదన్నారు. దాతలు చందాలు ఎవరికి ఇవ్వరాదని వారు సూచించారు. కొందరు సంబంధంలేని వ్యక్తులు అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు సాకుతో చందాలు చేస్తున్నారని తెలిసిందన్నారు. అటువంటి వాటికి తమకు ఎలాంటి సంబంధంలేదన్నారు.

చలివేంద్రం ప్రారంభించిన ఎస్ఐ

సిద్దవటం : భాకరాపేటలో ప్రయాణీకుల దాహార్తిని తీర్చేందుకు మా తండ్రి మాజీ మండలాధ్యక్షుడు కీ.శే.లు నాగం లక్ష్మిరెడ్డి జ్ఞాపకార్థం 21 సంవత్సరం నుంచి ప్రతి ఏడాది చలివేద్రంను ఏర్పాటు చేస్తున్నామని వైఎస్సార్‌సీపీ నాయకుడు నాగం నరసింహారెడ్డి అన్నారు. భాకరాపేట మూడు రోడ్ల కూడలిలో ఏర్పాటు చేసిన చలివేంద్రంను బుధవారం ఎస్ఐ తులసీ నాగప్రసాద్ ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఏకుల రాజేశ్వరిరెడ్డి, మాజీ సర్పంచ్ నాగం వెంకటసుబ్బమ్మ, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి, ఆర్ఎంపీ డాక్టర్ మురళి, పార్టీ నాయకులు తుర్రా ప్రతాప్, శేఖర్, నాగేంద్రం, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

రాయచోటి అర్బన్ : రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న బాధితుడికి బుధవారం జిన్నా సేవా సంస్థ సభ్యులు ఆర్థికసాయం అందించారు. మాసాపేట ఇందిరమ్మ కాలనీకి చెందిన నరసింహ అనే యువకుడు స్టోర్ బియ్యంను పంపిణీ చేసే ఆటో నడుపుతూ కుటుంబ భారాన్ని పోషిస్తున్నాడు. కొద్దిరోజుల క్రితం ఆటోకు ద్విచక్రవాహనం అడ్డురావడం, దాని తప్పించబోయి ప్రమాదానికి గురయ్యాడు. ప్రమాదంలో కుడికాలు దెబ్బతినడంతో మోకాలుకు ఆపరేషన్ చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. విషయం తెలుసుకున్న జిన్నా సేవాసంస్థ సభ్యులు షరీఫ్, ఆరీఫ్, రఫీక్, ఆర్ట్స్ శంకర్ బుధవారం నరసింహ కుటుంబాన్ని పరామర్శించారు. తమవంతుగా రూ.10వేలు ఆర్థికసాయాన్ని అందజేశారు. నరసింహులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

వైభవంగా సీతారాముల కల్యాణం


శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి అలంకారంలో కోదండ రాముడు

రాయచోటి టౌన్ (వీరబల్లి) : సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. బుధవారం వీరబల్లి మండలం ఓదివీడు పంచాయతీ పరిధిలోని రామాపురంలో ఉన్న శ్రీ సీతారామ ఆలయంలో కల్యాణంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమానికి చమర్తి జగన్‌మోహన్ రాజు ముఖ్య అతిథిగా పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం భక్తులకు పానకాలు, వడపప్పు పంచిపెట్టడంతో పాటు భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ వీరబల్లె మండల అధ్యక్షుడు వేణుగోపాల్ రాజు, సిద్ధిరాజు, రవీంద్రరాజు, మాజీ సర్పంచ్ వెంకట్రామరాజు, జగిలి రామచంద్రయ్య, రాచరాయుడు, నందన్‌కుమార్ నాయుడు, సుబ్బరామరాజు, సాయికిరణ్, దుర్గం ఆంజనేయులు, నేతి రమేష్ బాబు, సుధాకర్, పృథ్వీరాజు, నాగయ్య, రెడ్డెయ్య రాజు తదితరులు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లెలో..

లక్కిరెడ్డిపల్లె : శ్రీ రామ నవమి ఉత్సవాలను పురస్కరించుకొని లక్కిరెడ్డిపల్లెలోని శ్రీ రామాలయంలో అర్చకుడు నారాయణశాస్త్రిచే సీతారాముల లక్ష్మణ సమేత శ్రీ ఆంజనేయస్వాముల కల్యాణోత్సవం కార్యక్రమంలో భాగంగా బుధవారం స్వామివారి ఉత్సవ విగ్రహాలకు క్షీరాభిషేకం చేసి పూజలు నిర్వహించారు. భక్తులు శ్రీ సీతారాములవారికి కొబ్బరికాయలు కొట్టి కర్పూర హారతులు సమర్పించారు. పానకం, పెసరపప్పు, లడ్డు ప్రసాదాలు భక్తులకు పంచిపెట్టారు. రాత్రి వేళల్లో సీతారామ లక్ష్మణ సమేతుడైన శ్రీ ఆంజనేయస్వాముల వారి ఉత్సవ విగ్రహాలకు ఊరేగింపు చేశారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు సురేష్, అమృతవల్లి దంపతులు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ప్రత్యేక అలంకరణలో శ్రీరాముడు

రాజంపేట రూరల్ : నియోజకవర్గ వ్యాప్తంగా నిర్వహించుకుంటున్న శ్రీరామ నవమి వేడుకలు బుధవారం 7వ రోజుకు చేరుకున్నాయి. ఈ వేడుకలలో భాగంగా కనుల పండువగా కల్యాణం నిర్వహించారు. అనంతరం వేడుకగా గ్రామోత్సవం జరిపారు. భువనగిరిపల్లెలో ఉత్సవాల 7వ రోజు శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి అలంకారంలో సీతారాములను ప్రత్యేకంగా కొలువుదీర్చి అలంకరించారు.

అభివృద్ధి పనుల పరిశీలన


పనులు పరిశీలిస్తున్న కమిషనర్ గంగాప్రసాద్

రాయచోటి అర్బన్ : పట్టణంలోని కొత్తపేట ప్రధాన రహదారి నుంచి ఎన్‌జీఓ కాలనీకి వెళ్లే మార్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను బుధవారం మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్ పరిశీలించారు. రూ. 5 లక్షలతో డ్రైనేజీ కాలువలు, రూ.5 లక్షలతో 160 మీటర్ల పొడవు సిమెంటు రోడ్డు పనులను కాంట్రాక్టర్ గంగిరెడ్డి ప్రారంభించగా బుధవారం కమిషనర్‌తోపాటు వార్డు కౌన్సిలర్ మదనమోహన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ సుబ్బారెడ్డిలు పనులను పరిశీలించారు.

సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా శివరామకృష్ణ దేవర

రాజంపేట రూరల్ : రాయచోటిలో ఈ నెల 3, 4వ తేదీలలో నిర్వహించిన సీపీఐ జిల్లా సమితి సమావేశాలలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా తనను ఎన్నుకున్నట్లు బుధవారం ఎం.శివరామకృష్ణదేవర తెలియజేశారు. తనకు పదవిని అందించిన వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

దళితవాడలో తాగునీటి సమస్య పరిష్కారం


నూతన మోటార్లను ఏర్పాటు చేయిస్తున్న సర్పంచ్‌లు

ఓబులవారిపల్లె : మండల పరిధిలోని పెద్దఓరంపాడు పంచాయతీ దళితవాడలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం బుధవారం కొత్త మోటార్లను సర్పంచ్ ఆర్.ఈశ్వరయ్య, సీనియర్ నాయకులు కొమ్మిరెడ్డి సుబ్బారెడ్డిలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితవాడ గ్రామంలో తాగునీటి సమస్య ఉండటంతో ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్ రెడ్డి సహకారంతో మండల నిధులు దాదాపు రూ. 1.50లక్షలు కేటాయించారన్నారు. దీంతో గ్రామంలో రెండు నూతన మోటార్లను ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించినట్టు చెప్పారు. కార్యక్రమంలో యల్లాయపల్లి సర్పంచ్ జి.నారాయణరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వెన్నెల వెలుగుల్లో.. నీలి మేఘశ్యాముడి కల్యాణం


శ్రీ రామచంద్రుడి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

ఒంటిమిట్ట శ్రీ కోదండ రామచంద్రుడి బ్రహ్మోత్సవాలలో బుధవారం కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. స్వామి వారి కల్యాణానికి అశేష జనవాహినిగా భక్తులు తరలివచ్చారు. కల్యాణ ప్రాంగణం శ్రీరామ నామస్మరణతో మార్మోగాయి. ఉదయం శివధనుర్భంగాలంకారంలో రాముల వారి రాజసం భక్తులకు కనువిందు చేసింది. రాత్రి కల్యాణం అనంతరం స్వామి గజ వాహనంపై మాఢ వీధులలో విహరించారు.

– ఒంటిమిట్ట


మంగళవాయిద్యాలు వాయిస్తున్న కేరళా బృందం

ఇఫ్తార్ విందు

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలో పెద్ద మసీదులో బుధవారం ఇంద్రానీ ఛారిటబుల్ ట్రస్టు వారి ఆధ్వర్యంలో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఛారిటబుల్ ట్రస్టు చైర్మన్ చేజర్ల ఇంద్రకుమార్ రాజు మాట్లాడుతూ ముస్లిం సోదరుల పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాసాలు ఉంటూ భక్తి శ్రద్ధలతో ఉపవాసాలుంటారని తమ ట్రస్టు ద్వారా ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని తెలిపారు. 500 మంది ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు.

ఘనంగా జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు

రాజంపేట : సంస్కరణవాది బాబు జగ్జీవన్‌రామ్ అని రాజంపేట శాసనసభ్యుడు మేడా మల్లికార్జునరెడ్డి అన్నారు. బుధవారం మేడా భవన్‌లో జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘ సంస్కర్తగా జగ్జీవన్‌రామ్ చేసిన మేలును ఎవరూ మరువలేరన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ, ఎస్టీ సెల్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు సత్యాల రామకృష్ణతోపాటు పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, దళిత, బీసీ వర్గాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ విప్ కొరముట్ల ఆధ్వర్యంలో...

రైల్వేకోడూరు : బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి బాబు జగ్జీవన్ రామ్ దేశ ఉప ప్రధానిగా ఎనలేని సేవలందించారని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జగ్జీవన్ రామ్ 116వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలే వేసి నివాళి అర్పించారు. అనంతరం కొరముట్ల మాట్లాడుతూ అట్టడుగు వర్గాల అభ్యున్నతికి, అణగారిన ప్రజల సమాన హక్కుల కోసం బాబు జగ్జీవన్ రామ్ చేసిన పోరాటం మరువలేనిదన్నారు. సంఘ సంస్కర్త గొప్ప రాజకీయవేత్త, అణగారిన ప్రజల సమాన హక్కుల కోసం కులరహిత సమాజం కోసం పోరాడిన వ్యక్తి అన్నారు. స్వాతంత్ర్య సమరయోధిడిగా, ఉప ప్రధానిగా దేశసేవకు అంకితమైన ఆయన జీవితం ప్రతి ఒక్కరికి స్ఫూర్తి దాయకం అని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, ఉప సర్పంచ్ తోట శివసాయి, జెట్పీటీసీ రత్నమ్మ, వినోద్‌ఖన్నా, దామర్ల సిద్దయ్య, డీవి రమణ, కొప్పల శంకరయ్య, శివయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

సిద్దవటంలో..

సిద్దవటం : ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌లో బుధవారం బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కమాండెంటు ఎన్. శ్రీనివాసరావు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కమాండెంటు మాట్లాడుతూ బాబు జగ్జీవన్‌రామ్ అట్టడుగు వర్గాల అభ్యున్నతికి, అణాగరిన ప్రజల సమాన హక్కుల కోసం చేసిన పోరాటం మరిచిపోలేనిదన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంటు కె. వెంకట్‌రెడ్డి, పి.ఎస్.డి. ప్రసాద్, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు ఏఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

సంబేపల్లెలో..

సంబేపల్లె : మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఘనంగా బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు నరసింహారెడ్డి మాట్లాడుతూ ఒక వైపు దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడుతూనే మరోవైపు అణగారిన వర్గాల కోసం అలు పెరగని సమరం సాగించి సామాజిక విప్లవ యోధుడిగా నిలిచారన్నారు.

రాయచోటిలో..

రాయచోటి అర్బన్ : భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్‌ను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ప్రజా సంఘాల నేతలు అన్నారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న అంబేడ్కర్ చిత్రపటం వద్ద ప్రజా సంఘాల నేతలు జగ్జీవన్‌రామ్ 116వ జయంతి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నేతలు రామాంజనేయులు, మనోహర్, వడ్డెర సంఘం నేత మారుతి, రజక సంఘం నేత శ్రీనివాసులు, గుంటిమడుగు ఆనంద్, సి.వి.రమణ, ఆంజనేయులు, మహదేవ, నరసింహులు, సుబ్బయ్య, ఈశ్వరయ్య, బసవయ్య, రమేష్‌బాబు, హరిబాబు, రాచరాయలు, నాగరాజులు పాల్గొన్నారు.

ఎస్టీయూ, డీహెచ్‌పీఎస్‌ల ఆధ్వర్యంలో..

రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్టీయూ), దళితహక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్)ల ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో వేర్వేరుగా జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు నిర్వహించారు. స్థానిక ఎస్టీయూ భవన్‌లో జగ్జీవన్‌రామ్ జయంతితో పాటు ఎస్టీయూ వ్యవస్థాపకుడు వీణా విజయ రామరాజు వర్ధంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్రనేత వై.రవీంద్రనాథరెడ్డి, శివారెడ్డి, గోపీక్రిష్ణ, వెంకటరామిరెడ్డితో పాటు పలు మండలాల ఎస్టీయూ నేతలు పాల్గొన్నారు.

దళిత బాంధవ్యుడు బాబు జగజ్జీవన్ రామ్

చిట్వేలి : దళిత హక్కుల కోసం కృషి చేసిన బాబు జగజ్జీవన్ రామ్ దళిత బాంధవ్యుడని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మందా నాగేశ్వర్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక విద్యా వనరుల కార్యాలయ ప్రాంగణంలో బాబు జగజ్జీవన్ రామ్ జయంతి వేడుకలను దళిత నాయకులు ఘనంగా నిర్వహించారు. బాబు జగజ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు నరసింహులు, డేవిడ్ ప్రసాద్, జిల్లా నాయకులు విశ్వనాథం, యానాదయ్య, ప్రసాద్, పద్మాకర్, మండల సీనియర్ నాయకులు సుధాకర్, ఈశ్వరయ్య, శ్రీనివాసులు, వెంకటయ్య, చిన్న రమేష్, పెంచలయ్య, కన్నయ్య, శేషయ్య, తదితరులు పాల్గొన్నారు.

నివాళి అర్పించిన జెడ్పీ చైర్మన్ ఆకేపాటి

రాజంపేట టౌన్ : బాబు జగ్జీవన్‌రామ్ దళితుల అభ్యున్నతికి పని చేస్తూ వారిని సామాజికంగా బలవంతులను చేసేందుకు సాంస్కృతిక ఉద్యమాలు చేపట్టారని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి తెలిపారు. స్థానిక అఫిషియల్ క్లబ్‌లో బుధవారం బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని డీసీఎంఎస్ మాజీ చైర్మన్ దండు గోపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అమర్‌నాథరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ మర్రి రవికుమార్, వైఎస్సార్‌సీపీ దళిత నాయకులు దండు గోపీ, దాసరి పెంచలయ్య, ఎమార్పీఎస్ నాయకులు బొజ్జా పెంచలయ్య, నగిరి పాటి బాబు, నరేంద్రబాబు, సుబ్బరాయుడు, మణీ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

8, 9న గంగమ్మ తిరునాల

గాలివీడు : మండలంలోని పేరంపల్లి పంచాయతీలో వెలసిన గంగమ్మ తిరునాల మహోత్సవం ఈనెల 8, 9వ తేదీలు శని, ఆదివారాలలో జరపనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శనివారం సద్దల కూడు నైవేద్యం అమ్మవారికి సమర్పించి అర్ధరాత్రి అలంకరించిన చాందినీ బండ్లు, కోలాటం, చెక్కభజనలతో నిండు తిరునాలగా మారి భక్తులకు అమ్మవారు దర్శనమిస్తారు. ఆదివారం ఉదయం బోనాల రూపంలో భక్తులు అమ్మవారికి మొక్కులు రూపంలో చెల్లించుకుంటారు. ఆదివారం సాయంత్రం బండలాగుడు పోటీలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

ఘనంగా విద్వాన్ కట్టా జయంత్యుత్సవం

రాజంపేట రూరల్ : తెలుగు పండితుడు, కవి, రచయిత, అవధాని, సాహితి పరిశోధకుడు, గ్రంథకర్త, బహుముఖ ప్రజ్ఞావంతుడైన విద్వాన్ కట్టా నరసింహులు 76వ జయంత్యుత్సవాన్ని తెలుగు భాషా సంరక్షణ సమితి జిల్లా సహాయ కార్యదర్శి గంగనపల్లి వెంకటరమణ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. స్థానిక ఫ్యూచర్ మైండ్స్ పాఠశాలలో బుధవారం నిర్వహించిన వేడుకలో ముందుగా విద్వాన్ కట్టా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు విద్వాన్ కట్టా ప్రతిభా పాటవాలను కొనియాడారు. కార్యక్రమంలో తెలుగు పండితులు యుపీ రాయుడు, వై నందకిషోర్‌గౌడ్, పీ వెంకటరమణ, వీ చిన్నయ్య, పీ వెంకటరమణ, బీవీ నారాయణరాజు, హరిప్రసాద్, సుబ్రమణ్యం, వీ వెంకటసుబ్బయ్య, పీ భారతీ, ఎం హైమావతి, తదితరులు పాల్గొన్నారు.

మహాభారత యజ్ఞానికి విరాళం


విరాళం అందజేస్తున్న బెస్తపల్లె వాస్తవ్యులు

చిన్నమండెం : మండల పరిధిలోని కేశాపురం గ్రామం రెడ్డివారిపల్లెలో జరుగుతున్న మహాభారత యజ్ఞానికి బెస్తపల్లె వాస్తవ్యులు రూ.72 వేల విరాళం అందజేశారు. ఈ మొత్తాన్ని సింగిల్ విండో అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో మహాభారత కార్యక్రమాన్ని వీక్షించడానికి పెద్దఎత్తున ప్రజలు హాజరుకావడం విశేషమని తెలిపారు.

వైద్య శిబిరానికి స్పందన

సిద్దవటం : మూలపల్లెలో జరిగిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సిద్దవటం మండలంలోని మూలపల్లె గ్రామంలో గాలి వీటి వివేకానందరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం జరిగింది. ఈ ఉచిత వైద్య శిబిరానికి 210 మంది పేషెంట్లు తరలివచ్చారు. వైద్యులు సంపత్ థైరాయిడ్, షుగర్, బీపీ, లివర్ పంక్షన్, కిడ్నీ వ్యాధుల వైద్య పరీక్షలు నిర్వహించారు. పేషంట్లకు రక్తనమూనాలను సేకరించి ఉచితంగా మందులను అందజేశారు.

నేడు వైఎస్ఆర్ ఆసరా

సంబేపల్లె : మండల కేంద్రంలో నేడు గురువారం ఎంపీపీ నాగశ్రీలక్ష్మీ పర్యవేక్షణలో వైఎస్ఆర్ ఆసరా కార్యక్రమాన్ని ఉదయం 9:30 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నరసింహులు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి డ్వాక్రా సంఘాల మహిళలకు మంజూరు చేసిన ఆసరా చెక్కుల పంపిణీలో రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి హాజరవుతున్నట్లు తెలిపారు. అదే విధంగా ఉదయం 9 గంటలకు మండలంలోని సీకే రోడ్డు నుంచి సీఎం కొత్తపల్లెకు వెళ్లే సిమెంట్ రోడ్డు, దేవపట్ల ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఓ విభాగాన్ని ప్రారంభిస్తున్నట్లు మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ ఉదయకుమార్‌రెడ్డిలు తెలిపారు.

ఆహార పొట్లాల పంపిణీ

చిట్వేలి : మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆహార పొట్లాలను పంపిణీ చేశారు. చిట్వేలి నివాసి పెయింటర్ అలిశెట్టి పెంచలయ్య కుమార్తె సంజన పుట్టినరోజును పురస్కరించుకొని అనాథలకు, పేదలకు, యాచకులకు, ఆహార పొట్లాలను పంపిణీ చేశారు. కుంభగిరి మునిరావు, కామాటం వెంకటేశ్వర్లు, కానిస్టేబుళ్లు గోపాల్, రమేష్‌లున్నారు.

అభినందన మాల



బద్వేలు : కాశినాయన మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ నల్లేరు విశ్వనాథరెడ్డి పుట్టినరోజు సందర్భంగా అభిమానులు, పార్టీ నాయకులు భారీ గజమాలతో అభినందనలు తెలిపారు. ఈ వేడుకలను పోరుమామిళ్లలోని ఆయన స్వగృహంలో ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి వేలాదిగా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, ప్రజాప్రతనిదులు, స్నేహితులు తరలివచ్చి శుభాకాంక్షలు తెలిపారు. విశ్వనాథరెడ్డి వారందరికీ ధన్యవాదాలు తెలపడంతో పాటు విందు ఏర్పాటు చేశారు.